సాక్షి
సిద్దిపేట
శనివారం । 7 । డిసెంబర్ । 2024



నారు దశ.. జాగ్రత్తలే రక్ష

వరి సాగులో నారుమడి తయారు చేసే రైతులు శీతాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వివరాలు 8లో ▸



ఏసీబీ వలలో కార్యదర్శి

రూ.15 వేల లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు.

వివరాలు 8లో ▸



మాట నిలబెట్టుకున్న..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నెలబెట్టుకుందని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి తెలిపారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

హుస్నాబాద్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ (కళాశాల)ను శుక్రవారం డీఐఈఓ రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు గైర్హాజర్ కాకుండా ప్రతి రోజు కళాశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల ప్రతిభకు పదను పెట్టాలన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈఓ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం: డీబీఎఫ్



మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): అంబేడ్కర్ స్ఫూర్తితో ఉపాధి హామీ పని హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దామని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్నట్లు 'సాక్షి'కి శుక్రవారం ఫోన్‌లో తెలిపారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచాలనీ, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం, డ్రోన్ కెమెరాలతో నిఘా వంటి అంశాలను తొలగించాలని ధర్నాలో డిమాండ్ చేసినట్లు తెలిపారు. పని దినాలను వంద రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని, జాబ్ కార్డులను తొలగించడాన్ని మానుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు దాసరి ఏగొండ స్వామి, పులి కల్పన, స్వామి, చుంచు రాజేందర్, దుబాషి సంజీవ్ తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

సినిమా టికెట్ ధరలు తగ్గించాలని ధర్నా

హుస్నాబాద్: పట్టణంలో పెంచిన సినిమా టికెట్ల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడుతూ పుష్పా 2 సినిమాకు ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచారన్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు థియేటర్లను సందర్శించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిని మూసివేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు నాయక్, అనిల్ నాయక్, గణేశ్ తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సమగ్ర శిక్షా ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ మాధవరెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించక పోతే ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. గత నెలలో ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చినా ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో ఎస్ఎస్ఏ ఉద్యోగులమంతా సమ్మెకు దిగుతున్నామన్నారు.

విచారణకు ఆదేశం

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతి పొందినట్టు సిద్దిపేట పట్టణానికి చెందిన షాదుల్ గతంలో హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై హైకోర్టు పరిధిలోని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పందించి సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం షాదులకు అందాయి. కౌన్సిల్ ఫర్ ఆర్టీఐ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా షాదుల్ పనిచేస్తున్నారు.

అటకెక్కిన ఆటోనగర్

ప్రారంభోత్సవం చేసి రెండేళ్లు

- షాపుల కోసం 426 ప్లాట్ల కేటాయింపు
- 25 ఎకరాల్లో రూ. 50 కోట్లతో అభివృద్ధికి నిర్ణయం
- నేటికీ దృష్టిసారించని అధికారులు

పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్న ఆటోనగర్ స్థలం



ఆటోనగర్ అటకెక్కింది. ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. వాహనాల డెంటింగ్ మొదలుకొని ఇంజన్ల మరమ్మతుల వరకు అన్నీ ఒకే చోట చేయడానికి గత ప్రభుత్వంలో మందపల్లి ఇండస్ట్రియల్ పార్కులో మోడల్ ఆటోనగర్ నిర్మాణం కోసం స్థలం కేటాయించింది. 25 ఎకరాల స్థలం కేటాయించడమేకాక.. అభివృద్ధి కోసం రూ.50 కోట్లు కేటాయించారు. ఇప్పటికీ అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆటోనగర్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది.

సిద్దిపేటఅర్బన్: అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆటోనగర్ నిర్మాణానికి 2022 ఆగస్టులో శంకుస్థాపన చేశారు. అనంతరం అందులో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క షాపునకు 400 గజాల చొప్పున 426 ప్లాట్లను ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించిన లీజు పత్రాలను సైతం సంబంధిత షాపు యజమానులకు అందజేశారు. షాపుల ఏర్పాటు చేసుకునే విషయంలో స్పష్టత కోసం యూనియన్ నాయకులకు ప్రభుత్వానికి మధ్య చర్చలు చేయడానికి నిర్ణయించారు. అప్పటి నుంచి చర్చలు జరగకపోవడంతో అడుగు ముందుకు పడటంలేదు. దీంతో మోడల్ ఆటోనగర్ ఏర్పాటు ప్రక్రియ అటకెక్కిందని అందరూ చర్చించుకుంటున్నారు.

షాపులు ఉన్న వారికి ప్రాధాన్యం..

సిద్దిపేట పట్టణంలోని వాహనాల మెకానిక్ షాపులు నిర్వహించే వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని, చిన్న చిన్న వాహనాల రిపేర్లు మొదలుకొని పెద్ద పెద్ద వాహనాల రిపేర్లు చేసే వారికి దుకాణాలు కేటాయిస్తామని చెప్పారు. అదే విధంగా రెగ్జిన్ వర్క్ చేసే షాపులు, డెంటింగ్ వర్క్ చేసే షాపులు ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించడం వల్ల వాహనాలకు సంబంధించిన అన్ని రకాల సేవలు ఒకే చోట ఉండేలా ఆటోనగర్‌ను రూపుదిద్దేందుకు చర్యలు తీసుకున్నారు. కాని అది పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు కార్యరూపం దాల్చడం లేదు.



ఆటోనగర్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు (ఫైల్)

వసతులు కల్పిస్తాం

ఆటోనగర్ నిర్మాణ పనుల విషయంలో మా సంస్థ నుంచి పూర్తి సహకారం ఉంటుంది. షాపుల ఏర్పాటు విషయంలో మెకానిక్ యూనియన్ నాయకులు వస్తే పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఆటోనగర్ నిర్మాణం పూర్తి చేసేందుకు మేం ఎదురుచూస్తున్నాం.

– అనురాధ, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్

పట్టణానికి దూరంగా ఉండడం వల్లేనా..

ఆటోనగర్ నిర్మించే ప్రాంతం సిద్దిపేట పట్టణానికి దాదాపు 8 కిలోమీటర్ల దూరానికి పైగానే ఉంటుంది. దీనికి తోడు ఆ ప్రాంతానికి సరైన రవాణా సదుపాయం లేదు. చిన్న చిన్న రిపేర్ల కోసం అంతదూరం ఎవరు వచ్చే అవకాశం ఉండదని యూనియన్ నాయకులు భావించి ఉండవచ్చని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. షాపుల ఏర్పాటు విషయంలో ఆర్థిక భారం పడుతుందని వెనుకడుగు వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రియల్ పార్కు ప్రాంతానికి నాలుగు వరుసల రోడ్డు మార్గం ఏర్పడింది. దీనికి తోడు వరంగల్ రోడ్డు జాతీయ రహదారిగా మారడంతో ఇప్పటికైనా యూనియన్ నాయకులు షాపుల ఏర్పాటుకు ముందుకు వస్తారా అనేది తెలాల్సి ఉంది.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పన
- కలెక్టర్ మనుచౌదరి
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కోహెడ(హుస్నాబాద్): విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, బడుల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. హుస్నాబాద్ కేంద్రంలో సెట్విన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని.. అందులో మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డులలో చిరునామాల సవరణ కోసం ప్రత్యేకంగా హుస్నాబాద్‌లో సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పేదలకు వైద్య కోసం పట్టణంలో 250 పడకల ఆసుపత్రిగా ఏర్పాటైందన్నారు. అలాగే మాతా శిశు కేంద్రాన్ని ఏర్పాటు చే శామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో సీసీ రోడ్లు, భవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అంతకు ముందు ప్రభుత్వ సంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను, కోహెడ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని అధ్యాపకులను, ఉపాధ్యాయులను ఆదేశించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని.. మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమానికి హాజరుకాలేక పోవడంతో కార్యక్రమంలో ఉన్న మంత్రి సోదరుడు పొన్నం సత్యం ఫోన్‌కు కాల్ చేసి తన సందేశాన్ని వినిపించారు. నియోజకవర్గంలో అనేక బీటీ రోడ్లుకు నిధులు మంజూరు చేశామన్నారు. కాగా ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సతీశ్, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ సురేఖ, ఎస్ఐ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమం

రాష్ట్రంలో నిరంకుశ పాలన

- చీటికి మాటికి హౌస్ అరెస్టులు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు

దుబ్బాక: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని పోలీసులు బయటకు రాకుండా హౌస్ అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను చీటికి మాటికి పోలీసులతో హౌస్ అరెస్టులు చేయిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది సంబురాలు జరుపుకుంటోందని విమర్శించారు. ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి అమలు చేసే సత్తాలేక ప్రశ్నించేవారిని అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. తమకు పోరాటాలు, కేసులు, అరెస్టులు, నిర్బంధాలు కొత్త కాదని ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. తమపై పెట్టిన అక్రమ కేసులు బేషరతుగా ఎత్తివేయకుంటే ఉద్యమం తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు.

కళాశాల బియ్యం పక్కదారి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వం అందించే సన్నబియ్యం ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్న సంఘటన పెద్దకోడూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం వెలుగు చేసింది. 465 కిలోల సన్న బియ్యాన్ని అధికారికంగా అమ్మినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేసి ప్రైవేటు వ్యక్తికి అమ్మారు. ఇది గమనించిన పలువురు ఆరా తీయగా కళాశాల నుంచి కొనుగోలు చేసినట్లు వ్యాపారి తెలిపారు. ఈ విషయమం ప్రిన్సిపాల్‌ను అడగగా కమిటీ నిర్ణయం మేరకు నాసిరకం బియ్యం అమ్మినట్లు తెలిపారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం

ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బక్కి వెంకటయ్య

సిద్దిపేటజోన్: అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో మాల యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విగ్రహావిష్కరణ చేసిన ఈ స్థలానికి పట్టా ఇవ్వాలని గతంలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడానని తెలిపారు. స్థలానికి పట్టా ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అధికారుల తీరుపై బక్కి వెంకటయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను విగ్రహావిష్కరణకు గురువారం రాత్రే స్వగ్రామం భూంపల్లికి వచ్చానన్నారు. విగ్రహావిష్కరణకు వస్తే సమస్య మరింత జటిలం అయ్యే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ఫోన్ ద్వారా విన్నవించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరోవైపు కార్యక్రమానికి వస్తుంటే పోలీసులు సైతం ఎస్కార్ట్ వాహనం ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేశారన్నారు. ఈ స్థలం ముమ్మాటికీ అంబేడ్కర్ సంఘానికి చెందిందన్నారు. ఇదిలా ఉంటే.. కొంతకాలంగా ఇరు వర్గాల మధ్య స్థల వివాదం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాల యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ పంటతో అధిక లాభాలు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సువర్ణ



ఆయిల్ పామ్ తోటలో అంతరపంటను పరిశీలిస్తున్న అధికారి సువర్ణ

దుబ్బాక: డ్రాగన్ ఫ్రూట్ పంటతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సువర్ణ అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పండ్లు, పూల తోటలు, ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. శుక్రవారం దుబ్బాక మండలంలోని హబ్సీపూర్, రామేశ్వరంపల్లి గ్రామాల్లో డ్రాగన్ ఫ్రూట్, మామిడి, ఆయిల్ ఫామ్ తోటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగులో అంతర పంటలు సాగు చేయాలన్నారు. టమాటా, సొరకాయ, కాకర, ఉల్లి, కొత్తి మీర, బీరకాయ పంటలను సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో దుబ్బాక డివిజన్ ఉద్యాన వన అధికారి రమేశ్, ఆయిల్ ఫెడ్ అధికారి అరవింద్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

- సాగునీరు, రోడ్ల అభివృద్ధికి నిధులు
- ఆరు గ్యారంటీల అమలుపైనా నజర్
- జిల్లా కేంద్ర అభివృద్ధికి జీహెచ్ఎంసీ నిధులు
- అందోల్‌కు ఉన్నత విద్యా సంస్థలు మంజూరు
- కొత్త సర్కారు పాలనకు నేటితో ఏడాది



బస్వాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఇటీవల శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. నీటిపారుదల, రోడ్లు, విద్యా, వైద్యం వంటి వాటి కోసం నిధులు మంజూరయ్యాయి. మరోవైపు ఆరు గ్యారెంటీలు అమలు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తకావొస్తుంది. ఈ ఏడాది కాలంలో జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిశీలిస్తే...

యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు..

ప్రతీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇందులోభాగంగా అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో వీటి నిర్మాణానికి కొన్ని నెలల క్రితం భూమి పూజ చేశారు. ఒక్కో గురుకులానికి సుమారు రూ.200 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సంగారెడ్డి జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాలకు ఈ గురుకులాలు మంజూరు కాకపోవడం గమనార్హం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట్ల తొలి విడతలో ఈ విద్యా సంస్థలు మంజూరయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్‌లో రూ.87 కోట్లతో నర్సింగ్ కాలేజీ, 150 పడకల ఆసుపత్రి మంజూరైంది. వీటి నిర్మాణ పనులకు ఇటీవల మంత్రి భూమి పూజ చేశారు.

నీటి పారుదల రంగానికి...

జిల్లాలో ఉన్న ఏకైన భారీ నీటిపారుదల ప్రాజెక్టు సింగూరు. దీన్ని నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు కాలువలకు లైనింగ్ పనులు చేపట్టలేదు. దీంతో చివరి ఆయకట్టు సాగునీరు అందడం ఇబ్బందిగా మారింది. ఈసారి లైనింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సుమారు రూ.160 కోట్లతో ఈ పనులకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు నీటిపారుదలశాఖ కసరత్తు చేస్తోంది. ఈ పనులు పూర్తయితే ఈ ప్రాజెక్టు ఆయకట్టు కొంత పెరిగే అవకాశాలున్నాయి. అలాగే పలు చెరువుల పునరుద్ధరణ పనులకు కూడా నిధులు మంజూరయ్యాయి. సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో చిన్న నీటి వనరుల అభివృద్ధికి నిధులు కేటాయించారు.

జిల్లా కేంద్ర అభివృద్ధికి హెచ్ఎండీఏ నిధులు...

సంగారెడ్డి పట్టణంలో రోడ్లు అభివృద్ధికి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిధులు కేటాయించింది. రూ.12 కోట్లతో సంగారెడ్డి బైపాస్‌రోడ్డును విస్తరించనున్నారు. సెంట్రల్ మీడియన్ పనులు చేపట్టనున్నారు. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోనూ పలు చెరువుల సుందరీకరణకు పనులను కూడా హెచ్ఎండీఏ చేపట్టాలని నిర్ణయించింది.

సంక్షేమంపైనా దృష్టి...

అభివృద్ధితోపాటు సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం (మహాలక్ష్మి పథకం) ద్వారా ఇప్పటి సుమారు 1.85 కోట్ల సార్లు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేసినట్లు గుర్తించారు. రూ.83.89 కోట్ల టికెట్ చార్జీలు మహిళలకు దక్కినట్లు లెక్కతేల్చారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం కింద జిల్లావ్యాప్తంగా 2.16 లక్షల మంది వినియోగదారులకు సంబంధించి రూ.56 కోట్ల బిల్లులు ఉచిత బిల్లులను ప్రభుత్వం భరించినట్లు విద్యుత్‌శాఖ ప్రకటించింది. వ్యవసాయ రుణాల మాఫీలో కింద జిల్లాలో 1.09లక్షల మంది రైతులకు సంబంధించి రూ.959.78 కోట్లు రుణాలు మాఫీ అయ్యాయి. అయితే వివిధ కారణాలతో చాలా మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. ఈ దరఖాస్తులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇలా ఏడాది కాలంలో ఇటు అభివృద్ధితోపాటు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

- జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు
- గజ్వేల్‌లో వాహనదారులకు అవగాహన

గజ్వేల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ పర్యావరణ కాలుష్య నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా గజ్వేల్‌లోని పిడిచెడ్ రోడ్డు చౌరస్తాలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనాల సంఖ్య విపరీతంగా పెరగటం వల్ల కాలుష్యం అదే స్థాయిలో పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఈ పరిస్థితి భయంకరంగా తయారైందని చెప్పారు. నగరంలోనూ కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. స్వచ్ఛమైన గాలిని పొందాలంటే కాలుష్యాన్ని నియంత్రించుకోవాలన్నారు. చెట్ల పెంపకం కూడా మరింత విస్తృతంగా జరగాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్, శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బల్వీర్ సింగ్, సీహెచ్ఓ రవీందర్‌రెడ్డి, ఎస్‌సీడీ కో-ఆర్డినేటర్లు రాజేందర్ వెంకటరమణ, ఫార్మాసిస్టు నర్సింహులు, హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులచే కాలుష్య నియంత్రణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డి జీవిత ప్రస్థానంపై పుస్తకం

పీసీసీ చీఫ్‌కు అందజేసిన రచయిత, ఉపాధ్యాయుడు మురళీ



పీసీసీ చీఫ్‌కు పుస్తకాన్ని అందచేస్తున్న మురళీ

నర్సాపూర్ : సీఎం రేవంత్‌రెడ్డి జీవిత ప్రస్థానాన్ని తెలిపేలా రాసిన పుస్తకాన్ని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు రచయిత, స్థానిక ప్రభుత్వ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు కొండా మురళీ అందజేశారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. తాను రాసిన పర్సీవరెన్స్ పర్సానీ ఫైడ్ పుస్తకాన్ని హైద్రాబాద్‌లో మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిసి అందజేశానన్నారు. రచనా శైలి సమాజానికి సేవ చేసే దిశగా ఉందని తనను అభినందించినట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

చిన్నశంకరంపేట(మెదక్):మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్.అంకిత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి తెలిపారు. చేగుంట మోడల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 విభాగంలో పాల్గొని ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. 10 నుంచి 14 వరకు యూపీలోని వారణాసి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరుగనున్న వాలీబాల్ జాతీయ పోటీల్లో పాల్గొంటుందని, అంకితకు ఖర్చుల కోసం రూ.3 వేలు హెచ్‌ఎం అందజేశారు. కార్యక్రమంలో పీడీ నరేశ్, ఉపాధ్యాయులు రమేశ్, సాన రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దెశెట్టి తిరుపతమ్మ ఇంట్లో ఎల్లమ్మ పండుగకు మద్దూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన బంధువులు పల్లపు గణేశ్, అనిత దంపతులు కొమురవెల్లికి వచ్చారు. పండుగ అనంతరం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అనిత మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి మూడు తులాల బంగారు పుస్తెల తాడు లాక్కుపోయాడని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు పేర్కొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం

వ్యక్తిపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. సిద్దిపేట ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐలు ఉమేశ్, సదాశివరావు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ మహేశ్ పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం విధి నిర్వహణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన నరేశ్ అనే వ్యక్తిని పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించడానికి ప్రయత్నించగా వారిని తిట్టి దురుసుగా ప్రవర్తించాడు. విధులకు ఆటంకం కలిగించడంతో వన్ టౌన్ పీఎస్ బ్లూకోట్ సిబ్బందికి సమాచారం అందించారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష

- శీతాకాలంలో నారుమడులపై ప్రత్యేక చొరవ అవసరం
- రాత్రిపూట నీరు తీసి, ఉదయం నింపాలి
- చలితో నారుమడిలో జింక్ లోపం ఏర్పడే అవకాశం
- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి రాధిక



అక్కన్నపేట మండలంలోని చౌడు తండాలో ఓ రైతు వేసిన నారు



రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/ అక్కన్నపేట(హుస్నాబాద్): జిల్లాలో రైతులు వరి నారు మడ్లు తయారు చేస్తున్నారు. వరి పంట సాగులో భాగంగా నారుమడి తయారు చేయు రైతులు శీతాకాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి, ఉదయం సమయాల్లో ఉష్ణోగ్రత తీవ్రత పూర్తిగా పడిపోతుంది. అందువల్ల నారుమడిలో నీరును మారుస్తూ నీటియాజమాన్యం పాటించాలి. దీంతో చలి నుంచి నారుమడిని కాపాడుకోవచ్చు. నారు ఆరోగ్యంగా పెరిగితేనే పంట దిగుబడి అధికంగా వస్తుంది. అందువల్ల నారుమడ్ల యాజమాన్య పద్ధతులు పాటించాలి. జిల్లాలో నారుమడ్ల తయారీలో ఉన్న రైతులకు ఈ శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక తెలిపారు.

నారుమడి తయారీ..

- రెండు గుంటల నారుమడికి 2 క్వింటాళ్ల కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోస్టును వేసి కలియదున్నాలి. ఈ సేంద్రియ ఎరువులను నారుమడుల్లో వాడటం వల్ల చలి తీవ్రతలో కూడా నారుకు పోషకాలు అంది ఎదుగుదలకు తోడ్పడుతుంది. లేదంటే రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 1 కిలో పోటాష్‌ను వేయాలి.

చలితో జింక్ లోపం..

- చలి అధికమైనప్పుడు జింక్ లోపం వచ్చే అవకాశం ఉంటుంది.
- అందువల్ల నారుమడిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని నారుమడిలో మొదటి వారం రోజుల పాటుగా తక్కువగా ఉంచాలి.
- రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు కంటే తక్కువగా ఉన్నప్పుడు నారు ఎదుగదు. కొన్ని సార్లు వరి చనిపోతుంది. దీని కోసం రసాయన ఎరువులను వినియోగించాలి.
- చలి సమస్యను అధిగమించడానికి వరి మడ్లపై టార్పాలిన్‌లు రాత్రిపూట ఉంచి, ఉదయం పూట తీసి వేయాలి.
- రాత్రిపూట వరి మడి నుంచి పూర్తిగా నీరు తీసివేసి, ఉదయం పూట తాజా నీటిని నింపాలి. దీంతో వరి ఎదుగుదలలో లోపం లేకుండా ఉంటుంది.
- కాండం తొలిచే పురుగు (మొగ్గ పురుగు) నుంచి పంటను కాపాడుకోవడానికి నారు తలలు తుంచి నాటు వేసుకోవాలి. దీంతో కాండం తొలిచే పురుగు నారు కొనలపై గుడ్లు పొదుగుతుంది. దీని వల్ల గుడ్లతోపాటుగా మొగ్గ పురుగును నివారించవచ్చును.
- నారు తీసే వారం రోజుల ముందు ఎకరా నారుమడికి 1 కిలో కార్బోఫ్యూరో త్రీజీ లేదా కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ పోర్‌జీ గుళికలను వేసుకున్నట్లయితే నాటు వేసిన నెల రోజుల వరకు ఎలాంటి కీటకాలు ఆశించకుండా పంటను రక్షించుకోవచ్చు.
- యాసంగిలో వరి పంట వేయాలనుకునే రైతులు స్వల్ప కాలిక రకాలను ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే నీటి లభ్యత పంట కాలం ఎక్కువైతే సమస్యలు ఎదురవుతాయి. అదే విధంగా వడగండ్లు, తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఎకరానికి 30 నుంచి 35 కిలోల విత్తనం అవసరం ఉంటుంది.
- కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బొండిజమ్‌తో విత్తన్న శుద్ధి చేయాలి. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు.
- నిద్రావ్యవస్థలో ఉన్న విత్తనాలను మేలుకొల్పడానికి 1 కిలో విత్తనానికి 10 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి.
- పశువుల పేడగాని, సేంద్రియ ఎరువును ఎకర నారుమడికి 100 నుంచి 200 కిలోలు వేయాలి.
- విత్తనాలు చల్లే ముందు ఎకరాకు 2 కిలోల నత్రజనిని, కిలో పోటాషియంను చల్లాలి. విత్తనాలు విత్తిన 15 రోజులకు 2 కిలోల భాస్వరం వేసుకోవాలి.

అధికారుల సలహాలు పాటించాలి



ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నిటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం ఉంటుంది.

– కరంటోతు శ్రీలత, వ్యవసాయ విస్తరణాధికారి, రామవరం

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఎల్‌ఓసీ ఇచ్చేందుకు రూ.15 వేలు డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
- రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



పట్టుబడిన నగదుతో ఉమేశ్

కల్హేర్(నారాయణఖేడ్): లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మహదేవుపల్లి చౌరస్తాలో ఫిష్ స్టాల్ ఏర్పాటు చేసేందుకు బ్యాంక్ లోన్ కోసం ఎల్‌ఓసీ సర్టిఫికెట్ జారీ చేయాలని మాసాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమేశ్‌ను ఆశ్రయించాడు. ఎల్‌ఓసీ ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం బాధితుడి వద్ద నుంచి పంచాయతీ కార్యదర్శి ఎంపీడీఓ కార్యాలయం వద్ద రూ.15 వేలు తీసుకోగా, ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. లంచం కింద తీసుకున్న డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడే రాత్రి వరకు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టు ప్రత్యేక నాయమూర్తి ఎదుట హాజరుపర్చడం జరిగిందని అధికారులు తెలిపారు. ఎవరైనా లంచం డిమాండు చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వ్యక్తుల పేర్లు రహస్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యువకుడు భాను(22) వ్యవసాయాధిత కుటుంబంలో జన్మించాడు. మూడు మాసాలుగా ఎలాంటి పని చేయకుండా తిరుగుతూ డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. కుటుంబ ఆర్థిక స్థోమత సరిగా లేక కూతురు కార్తీకను మేన సంబంధం వారితో తల్లిదండ్రులు పెళ్లి నిశ్చయించారు. దీన్ని విభేదిస్తూ భాను తల్లిదండ్రులను మరింత ఇబ్బందులకు గురి చేశాడు. శుక్రవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ కూలి పనికి వెళ్లగా ఇంటి వద్దే ఉన్న భాను చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండేళ్లు జైలు శిక్ష

మద్దూరు(హుస్నాబాద్): తల్లిని శారీరకంగా వేధించిన కేసులో కుమారుడికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఈ ఘటన దూల్మిట్ట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ మహబూబ్ కథనం మేరకు.. దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన కొండూరి శ్రీనివాస్ గతేడాది తన తల్లిని శారీరకంగా వేధించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ రెండేళ్లపాటు జైలు శిక్ష ను విధించారన్నారు.

కారు బోల్తా : బాలుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- వాహనం టైరు పేలి పొలాల్లోకి దూసుకెళ్లడంతో ప్రమాదం



శివచరణ్ మృతదేహం

నంగునూరు(సిద్దిపేట): అదుపుతప్పి కారు బోల్తా పడటంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం బద్దిపడగలో చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి రంజిత్ తన అన్న కొడుకు శివచరణ్ (10)తో కలిసి అత్తగారి గ్రామానికి కారులో సిద్దిపేట వైపు వెళ్తున్నాడు. బద్దిపడగ శివారులోకి రాగానే మలుపు వద్ద కారు టైరు పగిలి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శివ చరణ్, రంజిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అనంతరం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా శివచరణ్ మృతి చెందాడు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్



దాసు(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని కొడకండ్లకు చెందిన బీ.దాసు జీపీపీ ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నవంబర్ 26న కుకునూర్‌పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. దాసు మృతిపై జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

సిద్దిపేటరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇర్కోడు గ్రామ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీకి చెందిన ఎండీ షరీఫ్ నాలుగేళ్లుగా మానసిక స్థితి సరిగా లేక ఇంటి వద్దే ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన షరీఫ్ తిరిగి రాలేదు. అర్ధ రాత్రి 12 గంటలు సమయంలో ఇర్కోడు శివారు లావణ్య గార్డెన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి, బంధువు అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పబ్బతి ప్రతాప్‌రెడ్డి (60) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి బోరు మోటార్ ఆన్ చేయగా నడవ లేదు. పక్కనే ఉన్న స్తంభంపై బంపర్ తెగి ఉండటాన్ని గమనించాడు. సరి చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆఫ్ చేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో బంపర్ వైర్ తెగి ఆన్‌ఆఫ్ రాడ్‌పై పడడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. అది గమనించిన పక్క పొలం రైతు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



షో రూమ్‌ను ప్రారంభిస్తున్న సినీనటిశ్రీలీల, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రాజమౌళి, వెంకటేశ్వర్లు

ఆర్సీపురంలో శ్రీలీల సందడి

- సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభించిన నటి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సినీనటి, హీరోయిన్ శ్రీలీల రామచంద్రాపురం పట్టణంలో సందడి చేశారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 37వ షో రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినియోగదారులకు కలకాలం గుర్తుండిపోయేలా, వస్త్ర ప్రియులు ఆనందించేలా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం రూ.150 కనీస ధరతో కాస్ట్ టు కాస్ట్ అమ్మకాలతో తమ ప్రత్యేకతను చాటి చెప్పారని తెలిపారు.అనంతరం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. రాజమౌళి, సంస్థ డైరెక్టర్‌లు సురేశ్, అభినయ్, రాకేష్, కేశవ్, అభిమాన్య మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన దుస్తులను అందిస్తూ, వస్త్ర ప్రియుల అభిరుచులను దృష్టిలో పెట్టుకొని విశేష సేవలను అందిస్తున్నామని తెలిపారు.

క్రమశిక్షణే విజయానికి తొలి మెట్టు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



అనన్యను అభినందిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): క్రమ శిక్షణే విజయానికి తొలి మెట్టుగా నిలుస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్) నెట్ బాల్ పోటీలకు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.అనన్య ఎంపికైంది. 11న పంజాబ్ రాష్ట్రంలోని లూథాయానా పట్టణంలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అనన్యను సన్మానించి అభినందించారు. అలాగే, రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజాగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ నరేశ్, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సింహులు, సుముకేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జీవన్ కుమార్, శ్యామల, ధన్‌రాజ్, పద్మ, స్వామి, దుబ్బ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ



అవగాహన కల్పిస్తున్న జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్: ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కోకుండా ఉండటానికి, ఒక వేళ సమస్యలు వస్తే అధిగమించడానికి చట్టాలు తోడ్పడుతాయని సూచించారు. ఈ సందర్భంగా పోక్సో, సమాచార హక్కు, మోటారు వాహనాల, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహ నిరోధక చట్టాలు, జువైనల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయ సేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చట్టాలను గౌరవిస్తూ, అవసరమైతే తోటివారికి తెలియజేస్తూ సమాజానికి ఆదర్శవంతంగా ఉండాలన్నారు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఉన్నట్లు గుర్తిస్తే తహసీల్దార్, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు రుద్రయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన మహబూబ్‌నగర్, మెదక్ జిల్లా జట్ల క్రీడాకారులు

వర్గల్(గజ్వేల్): రాష్ట్రస్థాయి పూలే బీసీ గురుకుల బాలికల క్రీడా పోటీలు వర్గల్ పూలే గురుకులంలో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్–19 కబడ్డీ, అండర్–17 కబడ్డీ రెండు విభాగాల్లో మహబూబ్‌నగర్, మెదక్ జట్లు ఫైనల్‌కు చేరాయి. తుది పోరులో మహబూబ్‌నగర్ జట్టు ప్రత్యర్థి మెదక్ జట్టును ఓడించి విజేతగా నిలిచింది. అండర్–17 టెన్నీకాయిట్‌లో మహబూబ్‌నగర్, మెదక్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. అథ్లెటిక్స్‌లోనూ మహబూబ్‌నగర్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో దూసుకెళ్తున్నారు. ఓవరాల్‌గా మహబూబ్‌నగర్ జిల్లా ఆధిక్యంలో కొనసాగుతుంది. శనివారం మిగిలిన క్రీడాంశాల తుదిదశ ఫైనల్ పోటీలు జరుగుతాయని ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఆర్సీఓ గౌతమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

తుంపర సేద్యం అందని ద్రాక్ష

- జిల్లాలో ఈసారి 500 యూనిట్లు లక్ష్యం
- మంజూరులో తీవ్ర జాప్యం
- ఇప్పటికే డీడీలు చెల్లించిన రైతులు
- అధికారుల కనుసన్నల్లో పక్కదారి

కోహెడ(హుస్నాబాద్): రైతులకు తుంపర సేద్యం అందని ద్రాక్షగా మారింది. ఈ యాసంగిలో మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుకు రైతులు తుంపర సేద్యంను ఎక్కువ శాతం వినియోగిస్తారు. ఈయేటా జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది రైతులు తుంపర సేద్యం యూనిట్ల మంజూరు కోసం ప్రభుత్వానికి డీడీల రూపంలో డబ్బులు చెల్లించారు. 250 మంది రైతులకు యూనిట్లు మంజూరైనట్లు ఉద్యానశాఖ హుస్నాబాద్ డివిజన్ అధికారి (హెచ్ఓం) తెలిపారు. మిగితా వారికి స్ప్రింక్లర్ యూనిట్లు మంజూరు కాకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

స్ప్రింక్లర్ల కోసం ఎదురు చూపులు..

మొక్కజొన్న, వేరుశనగ రైతులు స్ప్రింక్లర్ల యూనిట్ల మంజూరు కోసం నెల రోజుల నుంచి ఎదురుచూస్తున్నారు. ఈ పంటలకు మార్కెట్‌లో మంచి ధర పలకడంతో ఈసారి మొక్కజొన్న మండల వ్యాప్తంగా సుమారు 1500 ఎకరాలు, వేరుశనగ సుమారుగా 250 ఎకరాలు సాగు కానుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటికే వేరుశనగ 150 ఎకరాలు, మొక్కజొన్న 750 ఎకరాలు సాగైందని పేర్కొన్నారు.



పక్కదారి పడుతున్న వైనం

రైతులకు మంజూరైయిన స్ప్రింక్లర్ల యూనిట్లు ఉద్యాన శాఖ అధికారుల కనుసన్నల్లో పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేవు. ఇటీవల మండల వ్యాప్తంగా 27 మంది రైతులకు స్ప్రింక్లర్ల యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో కొందరి లబ్ధిదారులకు సంబంధించిన స్ప్రింక్లర్ల యూనిట్స్‌లను తీగల కుంటపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆధీనంలో ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం. స్ప్రింక్లర్ యూనిట్ అత్యవసరం ఉన్న రైతులకు అధికారుల కనుసన్నల్లో స్ప్రింక్లర్ యూనిట్ ఒకటి రూ.23 వేల చొప్పు అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది.

డీడీలు చెల్లించి ఏడాది



స్ప్రింక్లర్ల యూనిట్ కోసం నా స్నేహితుడి భార్య పేరుతో డీడీ చెల్లించాను. అర్హులైన రైతులకు సరైన సమయంలో స్ప్రింక్లర్లు అందించడం లేదు. నా తర్వాత డీడీలు చెల్లించిన వారికి స్పింక్లర్ యూనిట్ అందజేశారు. కొన్ని యూనిట్‌లను బ్లాక్ చేసి బయటి వారికి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. నా యూనిట్ ఎప్పుడు ఇస్తారని అడిగితే ఇగవస్తది, అగవస్తాది అంటూ కాలయాపన చేస్తున్నారు.

– పేర్యాల సంపత్ రావు, రైతు కోహెడ

పారదర్శకంగా పంపిణీ



ఇప్పటికి హుస్నాబాద్ డివిజన్ వ్యాప్తంగా 250 స్ప్రింక్లర్ల యూనిట్‌లను రైతులకు అందించాం. పంపిణీ పారదర్శకంగా జరుగుతుంది. రైతులకు సరైన సమయంలో అందించడానికి కృషి చేస్తున్నాం. డీడీల వివరాలు ఎప్పటికప్పుడూ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. యూనిట్ మంజూరుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. నెల రోజుల్లో మిగితా రైతులకు అందించడానికి కృషి చేస్తున్నం.

– బాలాజీ, ఉద్యాన శాఖ హుస్నాబాద్ డివిజన్ అధికారి